

టంగుటూరి సేవలు ఆదర్శం

ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు నేటితరానికి స్ఫూర్తిదాయకమని ఎస్పీ హర్షవర్ధన్ రాజు పేర్కొన్నారు. - 8లో



కండలేరుపైనే ఆశలు

కండలేరు జలాశయంలో రోజురోజుకు నీటి మట్టం పెరుగుతుండడంతో అన్నదాతల్లో ఆశలు చిగురిస్తున్నాయి. - 8లో



సర్వేయర్‌ను సస్పెండ్ చేయాలి

సర్వేయర్‌ను సస్పెండ్ చేయాలని శనివారం చిట్టమూరు మండలంలోని సోమసముద్రం గ్రామస్తులు నిరసన చేపట్టారు. - 8లో

న్యూస్‌రీల్

నేడు గ్రామ సర్వేయర్ల డిపార్ట్‌మెంటల్ పరీక్షలు



మాట్లాడుతున్న డీఆర్వో నరసింహులు

తిరుపతి అర్బన్ : ఏపీపీఎస్సీ డిపార్ట్‌మెంటల్ సర్వేయర్ల పరీక్షలకు పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని డీఆర్వో నరసింహులు పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో ఆయన శనివారం పరీక్షల నిర్వహణపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివారం తిరుపతి నగరంలో 3 పరీక్షా కేంద్రాల్లో 1450 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని వెల్లడించారు. పరీక్షల నిర్వహణలో భాగంగా డిప్యూటీ తహసీల్దార్ లైజన్ అధికారిగా ఉంటారని చెప్పారు. పరీక్షలు తిరుపతిలోని వెస్ట్ చర్చి రోడ్డు, బాలాజీ కాలనీలోని శ్రీ పద్మావతి బాలికల ఉన్నత పాఠశాల (405) , శ్రీ పద్మావతి ఉమెన్స్ జూనియర్ కళాశాల (వింగ్-ఏ)(406, శ్రీ పద్మావతి ఉమెన్స్ జూనియర్ కళాశాల(వింగ్-ఏ)(407) నందు నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏపీపీఎస్సీ నుంచి అసిస్టెంట్ సెక్రటరీ టీఎస్ రాజ్‌గోపాల్, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్లు జగదీష్, యోగేష్ పాల్గొన్నారు.

డీఎస్సీ హిందీ పండిట్‌లో జిల్లా టాప్



షబనాజ్

రాపూరు : డీఎస్సీ-25 ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్ హిందీ విభాగంలో రాపూరు పంచాయతీ నవాబుపేటకు చెందిన విద్యార్థిని సయ్యద్ షబనాజ్ నెల్లూరు జిల్లాలో ప్రథమ స్థానం సాధించింది. ఉపాధ్యాయుల నియామకం కోసం చేపట్టిన డీఎస్సీ-25లో రాపూరు మసీదుపేటకు చెందిన సయ్యద్ సిరాజ్‌అహ్మద్, సయ్యద్ నర్తాజ్ కుమార్తె అయిన షబనాజ్ 84.65 మార్కులు సాధించి నెల్లూరు జిల్లాలో ప్రథమ స్థానం సాధించింది.

డీఎస్సీలో మెరిసిన పేదింటి కుసుమాలు

- రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకులతో చిట్టమూరు యువకులు



రాయి సాయి కోటి



మైలారి శ్రీకాంత్

చిట్టమూరు: మండలానికి చెందిన పేదింటికి చెందిన ఇద్దరు యువకులు డీఎస్సీలో రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకులు సాధించి సత్తా చాటారు. చిట్టమూరు మండలం కోగిలి పంచాయతీలోని గొల్లపాళెంకు చెందిన రాయి సాయి కోటి అనే యువకుడు ఫిజికల్ ఎడ్యుకేషన్ శిక్షణ పూర్తి చేసుకుని డీఎస్సీ-25 పరీక్షకు హాజరయ్యాడు. శుక్రవారం విడుదల చేసిన ఫలితాల్లో 93 మార్కులతో రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో నిలిచాడు.

ఎస్ఏ తెలుగులో మొదటి ర్యాంకు

చిట్టమూరు మండలం యల్లసిరి దళితవాడకు చెందిన మైలారి శ్రీకాంత్ 2025 డీఎస్సీ పరీక్షలకు హాజరయ్యాడు. రాష్ట్ర స్థాయిలో స్కూల్ అసిస్టెంట్ తెలుగు విభాగంలో మొదటి ర్యాంకు సాధించాడు. పేదింటి పిల్లలు రాష్ట్ర స్థాయిలో రెండు విభాగాల్లో మొదటి ర్యాంకులు సాధించడంతో చిట్టమూరు మండలానికి గుర్తింపు తీసుకొచ్చారు.

ఒకేసారి 5 టీచర్ ఉద్యోగాలు

- డీఎస్సీలో ఎర్రవారిపాళెం యువకుడి ప్రతిభ



శేషాద్రి

ఎర్రవారిపాళెం(చంద్రగిరి): మెగా డీఎస్సీ ఫలితా ల్లో ఎర్రవారిపాళెం మండలానికి చెందిన యువకుడు సత్తా చాటాడు. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 5 ఉద్యోగాలకు అర్హత సాధించాడు. ఎర్రవారిపాళెం మండలం ఓస్ గొల్లపల్లికి చెందిన ముంద్రే శేషాద్రి డీఎస్సీ పరీక్షలను రాశారు. అయితే శుక్రవారం వచ్చిన ఫలితాల్లో ఎస్ఏ సోషియల్‌లో 5.63 మార్కులతో 9వ ర్యాంకు, ఎస్‌జీటీలో 86.33 మార్కులతో 53వ ర్యాంకు, ఎస్ఏ తెలుగులో 73.05 మార్కులతో 42వ ర్యాంకు, టీజీటీ తెలుగులో 71.00 మార్కులతో 127వ ర్యాంకు, టీజీటీ సోషియల్‌లో 70.93 మార్కు లతో 82వ ర్యాంకు సాధించి 5 ఉద్యోగాలకు అర్హత సాధించాడు. ఒకేసారి వెలువడిన ఫలితాల్లో అద్భుత విజయం సాధించిన శేషాద్రిను గ్రామస్తులతో పాటు పలువురు అభినందించారు.

తిమ్మనాయుడుపాళెం యువకుడికి 3 ఉద్యోగాలు..



సాయినాథ్

కోట: మండలంలోని తిమ్మనాయుడుపాళెం గ్రామానికి చెందిన కావలి సాయినాథ్ డీఎస్సీ పరీక్ష ఫలితాల్లో మూడు ఉద్యోగాలు సాధించి ఔరా అనిపించాడు. పీజీటీ సోషల్ జోన్- 3లో 22వ ర్యాంక్, ఎస్ఏ సోషల్ నెల్లూరు జిల్లాలో 23వ ర్యాంక్, టీజీటీ సోషల్ జోన్ 3లో 59వ ర్యాంక్ సాధించాడు. తల్లిదండ్రులు నరసయ్య, రమణమ్మ వ్యవసాయ కూలీలు. ప్రస్తుతం రైల్వేలో ట్రాక్ మెయింటనర్‌గా దొరవారిసత్రంలో పనిచేస్తున్నాడు.



- తిరుపతి కొర్లగుంటకు చెందిన ఓ దంపతులకు వివాహమైన 5 ఏళ్లకు మగబిడ్డ జన్మించాడు. పుట్టిన 10 నెలల తర్వాత ప్రతి రోజు ఏడుస్తుండేవాడు. తల్లిదండ్రులు నగరంలో ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లి పరీక్షలు నిర్వహించగా డయాబెటీస్ టైప్-2 అని తేలింది. తల్లి, తండ్రికీ మధుమేహం లేదు. కానీ చిన్నారికి ఎలా సంక్రమించిదో అర్థం కాలేదని తల్లిదండ్రులు ఏడవని రోజు లేదు. వైద్యుల సూచనతో నెలకు మూడు సార్లు ఇన్సులిన్ వేయిస్తున్నారు. లేకలేక పుట్టిన బిడ్డకు ఇలా జరిగిందేమిటని తల్లిదండ్రులు కుమిలిపోతున్నారు.



బాల్యానికి తియ్యని కాటు

మధుమేహం మహమ్మారి విజృంభిస్తోంది. పెద్దలనే కాకుండా చిన్నారులపై తన ప్రతాపం చూపుతూ వేధిస్తోంది. పుట్టకతోనే పసికూనలపై దాడి చేస్తోంది. దీంతో జీవితాంతం సూదిపోటు తప్పడం లేదు. అల్లారుముద్దుగా పెంచుకున్న కన్నబిడ్డలను తల్లిదండ్రులే స్వయంగా ఆసుపత్రులకు తీసుకెళ్లి ఇన్సులిన్ ఇప్పిస్తుండడం కన్నవాళ్లకు కన్నీళ్లు తెప్పిస్తున్నాయి. ఇలాంటి బాధితుల సంఖ్య జిల్లాలో రోజురోజుకూ పెరుగుతుండడం అందరిలోనూ ఆందోళన కలిగిస్తోంది.

- పుట్టుకతోనే షుగర్ వ్యాధి బారిన పడుతున్న వైనం
- జిల్లాలో రోజురోజుకూ పెరుగుతున్న టైప్-1 రోగులు
- వంశపారంపర్యం, ఇన్ఫెక్షన్లు , వైరల్ వ్యాధులే కారణమంటున్న నిపుణులు
- ఇన్సులిన్ తీసుకోవడమే శరణ్యమంటున్న వైద్యులు
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో వేధిస్తున్న ఇన్సులిన్ కొరత



తిరుపతి తుడా : జిల్లాలో టైప్-2 డయాబెటీస్‌తో పోటీపడుతూ టైప్-1 డయాబెటీస్ వెంటాడుతోంది. పుట్టకతోనే సంక్రమిస్తూ వేల మంది చిన్నారుల జీవితాలతో ఆడుకుంటోంది. శరీరంలోని క్లోమ గ్రంధిలో ఇన్సులిన్ హర్మోన్ ఉత్పత్తి అవుతుంది. అయితే కొన్ని కారణాలతో ఈ గ్రంధిలో ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేసే బీటా కణాలను శరీరంలోని రోగ నిరోధక వ్యవస్థ నాశనం చేస్తుంది. దీని కారణంగా రక్తంలో చక్కెర స్థాయి పెరుగుతుంది. దీన్ని టైప్-1గా మధుమేహంగా పిలుస్తారు. సాధారణంగా పిల్లలు, యువతలో ఈ పరిస్థితి ఎక్కువగా కనిపిస్తోంది. అయితే కొన్ని సార్లు బీటా కణాలను రోగ నిరోధక వ్యవస్థ నిర్వీర్యం చేయడం కాకుండా క్లోమ గ్రంధికి ఏదైనా వ్యాధి సోకినప్పుడు, గాయం అయినప్పుడు బీటా కణాలు నిర్వీర్యమవుతాయి. దీని బారీన పడిన వారికి క్రమం తప్పకుండా ఇన్సులిన్ ఇవ్వాల్సి ఉంటుంది. ఇది కొంత మందికి వంశపారంపర్యంగా సంక్రమించవచ్చు. మరికొంత మందికి పలు రకాల ఇన్ఫెక్షన్లు, వైరల్ వ్యాధులు, ఇతర ప్రమాదకర అనారోగ్యాల కారణంగా ఈ పరిస్థితి ఏర్పడవచ్చు. ఆహారం, జీవనశైలి అలవాట్లు టైప్-1 డయాబెటీస్‌కు కారణాలు కావు.

30 శాతం బాధితులే

జిల్లాలో కోవిడ్ తర్వాత టైప్-1 మధుమేహం విజృంభణ ఎక్కువైంది. జిల్లాలో 30 శాతం మధుమేహ బాధితులు ఉండటం గమనార్హం. ఇందులో టైప్-2 డయాబెటిక్ బాధితులు 90శాతం ఉండగా టైప్-1 బాధితులు 15శాతం ఉన్నట్లు సమాచారం. ఈ లెక్కన టైప్-1 డయాబెటిక్ వ్యాధిగ్రస్తులు సుమారు 25 వేల మందికి పైగా ఉన్నట్లు అంచనా వేస్తున్నారు.

ప్రభుత్వాసుపత్రుల్లో ఇన్సులిన్ కొరత



ప్రభుత్వాసుపత్రుల్లో చికిత్సతో పాటు టైప్-1 డయాబెటీస్‌కు ఇన్సులిన్ ఉచితంగా అందించాల్సి ఉంది. అయితే జిల్లా కేంద్రంలోని ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రులలో అరకొరగా ఇన్సులిన్ అందిస్తున్నారు. మండల కేంద్రాలలోని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలలోనూ ఇన్సులిన్ పూర్తిగా అందుబాటులో లేకపోవడంతో వ్యయ ప్రయాసల కోర్చి బాధిత చిన్నారుల తల్లిదండ్రులు పట్టణ ప్రాంతాలలోని ప్రైవేటు హాస్పిటళ్లను ఆశ్రయిస్తున్నారు. ఒక్కో చిన్నారికి వ్యాధి తీవ్రతను బట్టి నెలకు సుమారు రెండు నుంచి నాలుగు ఇన్సులిన్ ఇంజెక్షన్లు ఇవ్వాల్సి ఉంటుంది. దీంతో నెలకు సుమారు రూ. 5 వేల నుంచి రూ. 6 వేల వరకు ఖర్చు అవుతోందని పేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నొప్పి తక్కువగా ఉండే ఇన్సులిన్ పెన్నుల ద్వారా ఇంజెక్షన్ వేస్తున్నారు. వీటి ఖరీదు సాధారణ ఇన్సులిన్ కంటే రెండు రెట్లు అధికంగా ఉంటుంది.

ఇన్సులిన్‌తో మాత్రమే చికిత్స



కోవిడ్ తర్వాత టైప్-1 డయాబెటీస్ రోగుల సంఖ్య పెరుగుతోంది. గతంలో ఈ వ్యాధి గ్రస్తులు కేవలం 3 నుంచి 5 శాతం మాత్రమే ఉండేది. ఇప్పుడు అది 10 నుంచి 15శాతానికి పెరిగింది. కోవిడ్ వైరస్ నేరుగా బీటా కణాలపై దాడి చేయడమే ఇందుకు కారణంగా చెప్పవచ్చు. చిన్నారుల్లో వచ్చే టైప్-1 మధుమేహం ఇన్సులిన్‌తో మాత్రమే చికిత్స అందుబాటులో ఉంది. ఆయాసం, కడుపు నొప్పి, వాంతుల లక్షణాలతో చిన్న పిల్లలను తల్లిదండ్రులు ఆసుపత్రికి తీసుకువస్తుంటారు. పరీక్షల నిర్వహించి డయాబెటీస్ నిర్ధారణ అయ్యాక చికిత్స ప్రారంభిస్తాం. వ్యాధి భారిన పడిన పిల్లలకు ఇన్సులిన్‌తో పాటు ఆహార నియమావళి తప్పనిసరిగా పాటించాలి.-డాక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి, చిన్నపిల్లల వైద్య నిపుణుడు, తిరుపతి



పట్టుదలకు శ్రమ తోడైతే విజయం సొంతమవుతుందని నిరూపించారు. మెగా డీఎస్సీ పరీక్షల్లో వేలాది మంది అభ్యర్థులను అధిగమించి ముందంజలో నిలిచారు. దొరికిన సమయాన్ని సద్వినియోగం చేసుకుని అహర్నిశలు శ్రమించారు. ప్రభుత్వ కొలువులు దక్కడమే గగనమైనే నేటి పరిస్థితుల్లో ఆచార్య కొలువులకు ఎంపికై తమ సత్తా చాటారు. శుక్రవారం అర్ధరాత్రి విడుదలైన ఫలితాలు చూసుకుని సంబరాలు చేసుకున్నారు.

పట్టుదలే తోడుగా.. నిలిచారు మేటిగా..

- మెగా డీఎస్సీ ఫలితాలు విడుదల
- ఉద్యోగాలకు అర్హత సాధించిన పలువురు అభ్యర్థులు
- జిల్లా విద్యాశాఖ వెబ్‌సైట్‌లో మెరిట్ జాబితా
- అభ్యర్థుల వ్యక్తిగత ఐడీ లాగిన్లకు కాల్‌లెటర్‌లు
- సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియకు విద్యాశాఖ సన్నాహాలు
- కొందరు మొదట్లో క్వాలిఫైడ్. ఇప్పుడేమో నాట్ క్వాలిఫైడ్
- సందేహాల నివృత్తికి పనిచేయని విద్యాశాఖ హెల్ప్‌లైన్ నంబర్లు

చిత్తూరు కలెక్టరేట్ : ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న డీఎస్సీ అభ్యర్థులకు తుది ఫలితాలు శుక్రవారం అర్ధరాత్రి విడుదలయ్యాయి. సంవత్సరాల తరబడి ఆచార్య కొలువునకు శిక్షణ పొంది, సన్నద్ధం అయిన అభ్యర్థుల కలలు నెరవేరాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా డీఎస్సీ పరీక్షలు రాసిన అభ్యర్థుల్లో ప్రతిభ చాటిన వారికి ప్రభుత్వ ఉపాధ్యాయ కొలువులు దక్కాయి. రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఎట్టకేలకు డీఎస్సీ అభ్యర్థుల తుది మెరిట్ జాబితాను సబ్జెక్టుల వారీగా విడుదల చేశారు. సంబంధిత జాబితాలను రాష్ట్ర విద్యాశాఖ డీఎస్సీ వెబ్‌సైట్‌తో పాటు, డీఈఓ వెబ్‌సైట్‌లో నమోదు చేశారు. సబ్జెక్టుల వారీగా పరీక్షలు రాసిన డీఎస్సీ అభ్యర్థులు తమ మెరిట్ జాబితాలను పరిశీలించుకునే వెసులుబాటు కల్పించారు. ర్యాంకుల వారీగా అభ్యర్థులు సాధించిన ఫలితాలను మెరిట్ జాబితాల్లో పేర్కొన్నారు. ఆ మెరిట్ ర్యాంకుల ఆధారంగా అభ్యర్థులు టీచర్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులు సంతోషంగా సంబరాలు జరుపుకున్నారు.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1,478 పోస్టుల భర్తీ

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1,478 టీచర్ పోస్టులు భర్తీ చేయనున్నారు. ఈ పోస్టుల భర్తీకి సంబంధించి మెగా డీఎస్సీలో అర్హత సాధించిన అభ్యర్థుల తుది ఫలితాలను ర్యాంకుల వారీగా పేర్కొన్నారు. జూన్ 5వ తేదీ నుంచి జూలై 3వ తేదీ వరకు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మెగా డీఎస్సీ పరీక్షలు నిర్వహించారు. ప్రస్తుతం విడుదల చేసిన తుది మెరిట్ జాబితా ఆధారంగా పోస్టులు భర్తీ చేయనున్నారు. రాష్ట్ర విద్యాశాఖ అధికారులు అర్హత సాధించిన అభ్యర్థుల డీఎస్సీ వ్యక్తిగత లాగిన్‌లో కాల్‌లెటర్లను పంపనున్నారు. ఆ కాల్‌లెటర్ల ఆధారంగా అభ్యర్థులు నిర్దేశించిన కేంద్రంలో సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరుకావాల్సి ఉంటుంది.

సర్టిఫికెట్ల పరిశీలనకు కసరత్తు



సర్టిఫికెట్ల పరిశీలన బృందాల శిక్షణలో మాట్లాడుతున్న డీఈవో వరలక్ష్మి

ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా మెగా డీఎస్సీ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు కాల్‌లెటర్లు అందగానే సర్టిఫికెట్ల పరిశీలన చేయనున్నారు. ఇందుకు చిత్తూరు జిల్లా విద్యాశాఖ అధికారులు పకడ్బందీగా కసరత్తు చేస్తున్నారు. పరిశీలనకు హాజరయ్యే బృందాలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి సూచనలు జారీ చేశారు. ఈ ప్రక్రియకు చిత్తూరు జిల్లా కేంద్రానికి సరిహద్దులో ఉండే అపోలో యూనివర్సిటీ, ఎస్వీ సెట్ ఇంజినీరింగ్ కళాశాలలను పరిశీలన కేంద్రాలుగా ఎంపిక చేశారు. ఈ కేంద్రాల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో డీఎస్సీ పరీక్షలో అర్హత సాధించిన 1,478 అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించనున్నారు. ఆయా అభ్యర్థులకు కాల్‌లెటర్‌లో సూచించే తేదీలు, సమయంలో సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టనున్నారు.

దివ్యాంగులకు అండగా వైఎస్సార్‌సీపీ



తిరుపతి 3వ డివిజన్‌లోని సచివాలయ సెక్రటరీకి వినతిపత్రాన్ని సమర్పిస్తున్న భూమన అభినయ్‌రెడ్డి, నేతలు

- 50 డివిజన్లలో పింఛన్లు పునరుద్ధరించాలని వినతిపత్రాలు
- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం : గతంలో ఏ ప్రభుత్వంలో జరగని విధంగా దివ్యాంగులకు వస్తున్న పింఛన్లు తొలగించి వారిని మరింతగా బాధపెడుతున్న కూటమి ప్రభుత్వంపై దివ్యాంగుల ఆగ్రహ జ్వాలలు ఎగిసిపడుతున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హత కలిగిన ప్రతి దివ్యాంగుడికి పెన్షన్ కల్పిస్తే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్ర వ్యాప్తంగా లక్షల దివ్యాంగుల పెన్షన్లను తొలగించారు. ఈ నేపథ్యంలో తిరుపతిలో దివ్యాంగులకు అండగా వైఎస్సార్‌సీపీ నిలబడింది. రెండు రోజుల కిందట తిరుపతి కలెక్టరేట్ కార్యాలయం వద్ద దివ్యాంగులు చేపట్టిన ధర్నాకు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి పార్టీ శ్రేణులతో కలిసి మద్దతు తెలిపి ధర్నా చేపట్టారు. శనివారం తిరుపతి నగరంలోని 50 డివిజన్‌లలో సచివాలయ సెక్రటరీలకు పింఛన్లు పునరుద్ధరించాలంటూ భూమన అభినయ్‌రెడ్డితో పాటు ఆయా వార్డు కార్పొరేటర్లు, పార్టీ శ్రేణులు వినతిపత్రాలను సమర్పించారు. తిరుపతి 3వ డివిజన్‌లో భూమన అభినయ్‌రెడ్డి వినతిపత్రం సమర్పించారు. కూటమి ప్రభుత్వం చేసిన తప్పిదాన్ని తెలుసుకుని దివ్యాంగుల పెన్షన్లను తిరిగీ పునరుద్ధరించాలని భూమన అభినయ్‌రెడ్డి డిమాండ్ చేశారు. తిరుపతి జిల్లాలో సుమారు 7,425 పింఛన్లు తొలగించారని, తిరుపతి నగరంలో 436 పెన్షన్లను తొలగించారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎన్నికల్లో ఇచ్చిన హామీలను చంద్రబాబు నెరవేర్చకుండా దివ్యాంగులకు వస్తున్న పెన్షన్లను రద్దు చేయడం దుర్మార్గమన్నారు. రద్దు చేసిన పింఛన్‌లను వెంటనే పునరుద్ధరించాలన్నారు. లేని పక్షంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు.

25న చలో కలెక్టరేట్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

తిరుపతి సిటీ : విద్యారంగ సమస్యలపై ఈనెల 25న కలెక్టర్ కార్యాలయం ఎదుట చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అక్బర్, రవి పిలుపునిచ్చారు. ఎస్వీయూ ప్రకాశం భవన్ ఎదుట విద్యారంగ సమస్యలతో కూడిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు అవుతున్నా రూ.6,400 కోట్ల ఫీజు బకాయిలు నేటికీ ఇవ్వకుండా విద్యార్థులను వేధిస్తోందన్నారు. కళాశాల యాజమాన్యం ఫీజులు చెల్లించాలని ఒత్తిడి చేసి విద్యార్థులను ఇబ్బంది పెడుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వ హాస్టల్ సమస్యలను కూటమి ప్రభుత్వం పట్టించుకున్న దాఖలాలు లేవని, ప్రశ్నించిన వారిపై కక్ష సాధింపు చర్యలకు దిగడం దారుణమన్నారు. ఆధ్యాత్మిక నగరంలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు లేకపోవడం అన్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. జీవో 77ను రద్దు చేసి తక్షణం అందరికీ ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీల కోఆర్డినేటర్ అశోక్, ఎస్వీయూ కార్యదర్శి వినోద్, నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉమ్మడి చిత్తూరు జిల్లా టాపర్‌లు వీరే..

- స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లీష్) లో సాధియా 87.24 స్కోర్‌తో మొదటి స్థానంలో నిలిచింది. ఈ సబ్జెక్ట్‌లో మొత్తం 1,190 మంది మెరిట్ జాబితాను ప్రకటించారు.
- స్కూల్ అసిస్టెంట్ (హిందీ)లో బురదగుంట బావాజీ 83.53 స్కోర్‌తో మొదటి స్థానం కైవసం చేసుకున్నారు. మొత్తం 628 మంది మెరిట్ జాబితాను ప్రచురించారు.
- స్కూల్ అసిస్టెంట్ (తమిళం)లో కేవలం ఇద్దరు మాత్రమే ఉన్నారు. మొదటి స్థానంలో నందిని 65.04, రెండో స్థానంలో సెల్వరాజ్ 42.63 స్కోర్‌ను సాధించారు.
- స్కూల్ అసిస్టెంట్ (తెలుగు)లో విజయ్ 87.01 తో మొదటి స్థానంలో నిలువగా 1,594 మంది ఫలితాలను ప్రకటించారు.
- స్కూల్ అసిస్టెంట్ (ఉర్దూ)లో సయ్యద్ షాహినూర్ 84.93 స్కోర్ తో మొదటి స్థానంలో నిలువగా 95 మంది మెరిట్ జాబితాను వెల్లడించారు.

స్కూల్ అసిస్టెంట్ నాన్ ల్యాంగ్వేజెస్ కేటగిరీలో..

- స్కూల్ అసిస్టెంట్ (బయాలజికల్ సైన్స్)లో అబ్దుల్ రహమాన్ 84.49, స్కూల్ అసిస్టెంట్ (బయాలజికల్ సైన్స్ తమిళ మీడియం)లో కేవలం ఏడుగురు మాత్రమే ఉన్నారు. ఇందులో రవిబాబు, ప్రీతి 69.17 స్కోర్‌తో మొదటి స్థానంలో నిలిచారు. ఎస్ఏ (బయాలజికల్ సైన్స్ ఉర్దూ)లో సబీనా రహమతున్నీసా 65.10 స్కోర్‌తో, ఎస్ఏ (గణితం)లో సురేఖ 88.80, ఎస్ఏ (గణితం, తమిళం)లో తమిళ్ సెల్వి 66.10, ఎస్ఏ (గణితం, ఉర్దూ)లో మహమ్మద్ జిలానీ 67, ఎస్ఏ (ఫిజికల్ ఎడ్యుకేషన్)లో నవీన్ కుమార్ 91, ఎస్ఏ (ఫిజికల్ సైన్స్)లో రాజేష్‌కుమార్ 78.08, ఎస్ఏ (సోషల్)లో సురేష్‌కుమార్ 86.68, ఎస్ఏ (సోషల్, తమిళ మీడియం)లో తులసీ రామన్ 67.47, ఎస్ఏ (సోషల్, ఉర్దూ)లో షేక్ మాలాలి 65.52 స్కోర్‌తో మొదటి స్థానంలో నిలిచారు.

ఎస్జీటీ పోస్టుల్లో..

సెకండరీ గ్రేడ్ టీచర్స్ (ఎస్జీటీ)లో ఉషారాణి 94.62 స్కోర్‌తో మొదటి స్థానంలో నిలిచారు. ఎస్జీటీ (తమిళం)లో హేమలత 72.90, ఎస్జీటీ (ఉర్దూ)లో షేక్ అఫ్రీన్ తాజ్ 83.03 స్కోర్‌తో మొదటి స్థానం దక్కించుకున్నారు. అలాగే జోన్‌ల వారీగా పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్స్ (పీజీటీ) మెరిట్ జాబితాలను, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ పోస్టుల మెరిట్ జాబితాలను విడుదల చేశారు.

మొదట్లో అర్హత...ఇప్పుడేమో అనర్హత



హెల్ప్‌లైన్ నంబర్లు పనిచేయడం లేదని ఓ వాట్సాప్ గ్రూప్‌లో బాధితురాలు పెట్టిన మెసేజ్

కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహిస్తున్నామని ఎంతో ఆర్భాటం చేస్తోంది. అయితే ఈ కసరత్తులో పలుసార్లు తప్పిదాలు చోటు చేసుకుంటున్నాయి. తాజాగా విడుదలైన డీఎస్సీ తుది మెరిట్ జాబితాలో పలువురు అభ్యర్థుల ఫలితాల్లో తప్పిదాలు చోటు చేసుకున్నాయి. రాష్ట్ర విద్యాశాఖ అధికారులు మొదట్లో విడుదల చేసిన ఫలితాల్లో కొంత మంది అభ్యర్థులు అర్హత సాధించారు. ఇప్పుడేమో తాజాగా విడుదల చేసిన ఫలితాల్లో అనర్హత సాధించినట్లు పేర్కొన్నారు. ఈ ఫలితాలను చూసిన అభ్యర్థులకు పలు అనుమానాలు కలుగుతున్నాయి. మొదట్లో అర్హత రావడం....ఇప్పుడు అనర్హత రావడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి సమస్యతో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో చాలా మంది అభ్యర్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యలు పరిష్కరించుకునేందుకు రాష్ట్ర వెబ్‌సైట్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌ను అభ్యర్థులు సంప్రదిస్తున్నారు. అయితే ఆ హెల్ప్‌డెస్క్ నంబర్లు పనిచేయడం లేదని అభ్యర్థులు వాపోతున్నారు. తుది ఫలితాలు విడుదలైన సమయంలో హెల్ప్‌డెస్క్ నంబర్లు పనిచేయకపోవడంపై అభ్యర్థుల్లో పలు అనుమానాలు తలెత్తుతున్నాయి.



బంగారం :
24 క్యారెట్లు 10 గ్రాములు రూ.1,03,430
22 క్యారెట్లు ఒక గ్రాము రూ.9,315
వెండి:
హోల్‌సేల్ ధర (కిలో) రూ.1,19,900
రిటైల్ వెండి గ్రాము రూ.123.00

క్లుప్తంగా

యువకుడి ఆత్మహత్య


రాజు (ఫైల్)

రేణిగుంట : రేణిగుంట పంచాయతీ పరిధిలోని వివేకానంద కాలనీలో నివాసం ఉంటున్న సెల్వరాజ్ కుమారుడు రాజు (24) ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం రేణిగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొచ్చారు. అప్పటికే రాజు మృతి చెందినట్లు వైద్యాధికారులు నిర్ధారించారు. రేణిగుంట అర్బన్ పోలీసులకు సమాచారం అందడంతో ట్రైనీ ఎస్ఐ స్వాతి సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

25న చిల్లకూరు, చిట్టేడులో పింక్‌బస్ శిబిరాలు

తిరుపతి తుడా : స్విమ్స్ ఆధ్వర్యంలో ఈనెల 25న సోమవారం చిల్లకూరు మండల కేంద్రంలోని పీహెచ్‌సీ, కోట మండలంలోని చిట్టేడు పీహెచ్‌సీలో పింక్ బస్ శిబిరాలు నిర్వహించనున్నట్లు వైద్యాధికారులు డాక్టర్ షాలోమ్ అరాఫత్, డాక్టర్ నాగరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరాల్లో క్యాన్సర్ వ్యాధితో పాటు బీపీ, షుగర్, పరీక్షలు ఉచితంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

సత్యవేడు : మండలంలోని కొత్తమారికుప్పం పంచాయతీ గిరిజన కాలనీలో అద్దె ఇంట్లో ఉంటున్న సంపత్ కుమార్(34) రెండు రోజుల కిందట ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శనివారం ఇంటి నుంచి దుర్వాసన రావడంతో సమీప ఇళ్లలో ఉంటున్న వారు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ రామస్వామి సంఘటనా స్థలానికి వెళ్లి మృతుడి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. సంపత్ కుమార్ పాలగుంటలోని కాఫ్రికాన్ కంపెనీలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతడి స్వగ్రామం కృష్ణసముద్రంగా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం చేసి కుటుంబ సభ్యులకు అందజేశారు. కుటుంబ కలహాలతో ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు చెబుతున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

బార్ పాలసీపై అపోహలు వద్దు

తిరుపతి క్రైమ్ : ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన బార్ పాలసీ పై అపోహలు వద్దని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగమల్లేశ్వర్‌రెడ్డి తెలిపారు. 2025–28వ సంవత్సరానికి కొత్త బార్ పాలసీని ఇటీవల ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో 29 ఓపెన్ క్యాటగిరి, మూడు రిజర్వేషన్ కేటగిరి కల్లుగీత కార్మికులకు కేటాయించిందన్నారు. ఇవీ లాటరీ విధానం ద్వారా కేటాయించినట్లు చెప్పారు. ప్రతి దరఖాస్తుదారుడు రూ.5 లక్షలు, 10,000 ప్రాసెసింగ్ ఫీజు సమర్పించాలన్నారు. నాలుగు కన్నా తక్కువ దరఖాస్తులు వస్తే ఆ బార్ లైసెన్స్‌కు లాటరీ జరగదని తెలిపారు.

కండలేరుపైనే ఆశలు

- సోమశిల నుంచి జోరుగా వరద నీరు
- ఈ సీజన్‌కు డోకా లేదు


జోరుగా ప్రవహిస్తున్న కైవల్యానది

సైదాపురం : నెల్లూరు, తిరుపతి జిల్లాలకు వరప్రదాయినిగా ఉన్న కండలేరు జలాశయంలోకి రోజురోజుకూ నీటి మట్టం పెరుగుతుండడంతో అన్నదాతల ఆశలన్నీ కండలేరు జలాశయంపైనే ఉన్నాయి. ప్రధానంగా నాన్ డెల్టా రైతుల ఆశలు మరింత చిగురిస్తున్నాయి. కండలేరు జలాశయంలో ఇప్పటికే 30 టీఎంసీల నీటి నిల్వలు ఉండడంతో ఈ సీజన్ సాగుకు డోకా లేదని రైతులు భావిస్తున్నారు. నెల్లూరు జిల్లాతో పాటు తిరుపతి జిల్లాలోని కొన్ని మండలాలకు కండలేరు జలాశయం ద్వారా సాగు నీరును కూడా విడుదల చేశారు.

పెరుగుతున్న వరద

ప్రధానంగా కండలేరు జలాశయంలో నేడు 30 టీఎంసీలు చేరాయి.దీనికి తోడు ప్రతి రోజు సోమశిల జలాశయం నుంచి 9400 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. దీంతో సెప్టెంబర్ నెలాఖరుకు 50 టీఎంసీలు నీరు చేరు అవకాశం ఉందని అధికారులతో పాటు రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కండలేరు జలాశయంలో పుష్కలంగా నీరు ఉండటంతో ఆయకట్టు రైతులకు రబీపై మరింత భరోసా కలిగింది.

ఆగస్టులో డెడ్‌స్టోరేజ్..

గత ఆగస్టు నెలలో కండలేరు డెడ్ స్టోరేజీకి చేరుకుంది.సోమశిల జలాశయం నుంచి వరద నీరు వచ్చి చేరుతుండటంతో ప్రస్తుతం 30 టీఎంసీలు జలాశయంలో నీరు నిల్వ ఉంది. ప్రధానంగా సర్వేపల్లి, వెంకటగిరి, శ్రీకాళహస్తి , సత్యవేడు, గూడూరు నియోజకవర్గాలకు చెందిన రైతులకు కండలేరు జలాశయం నుంచి వచ్చే నీటిని ఆధారం చేసుకుని రబీ పంటల సాగువుతున్నాయి.

చెరువులకు సాగునీరు

కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1600 క్యూసెక్కులు, పిన్నేరు కాలువకు 30 క్యూసెక్కులు ,లోలెవల్ కాలువకు 20 క్యూసెక్కులు ,మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కులు వంతున నీరు విడుదల చేస్తున్నారు. దీంతో కండలేరు నుంచి చెరువులకు సాగునీరు అందే అవకాశం ఉంది.

అవసరం ఇలా...

కండలేరు జలాశయం పరిధిలో సుమారు 3 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ ఆయకట్టు ద్వారా నెల్లూరు, తిరుపతి జిల్లాలో ప్రస్తుతం రబీ సీజన్‌లో సాగునీటి అవసరాలకు విడతల వారీగా నీటిని విడుదల చేస్తున్నారు.

రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా



రబీ సీజన్‌కు రైతుల ఆశలు తీరనున్నాయ్. నాన్‌డెల్టా ప్రాంత రైతులు రబీ సీజన్‌లో పంటలు పండించుకునే అవకాశం ఏర్పడింది. అధికారులు రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా సాగునీటిని సరఫరా చేయాల్సి ఉంది. – రాంగోపాల్‌రెడ్డి, గులించెర్ల, సైదాపురం మండలం

కైవల్యానదికి గంగనీరు



ఈ ఏడాది సాగు నీటి కోసం పడరాని పాట్లు పడ్డాం. కాని ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురవడంతో కండలేరు జలాశయానికి 30 టీఎంసీలు నీరు నిల్వ ఉంది. దీంతో కండలేరు నుంచి కైవల్యానదికి నీరును విడుదల చేయడంతో ఈ ప్రాంత రైతులకు సాగు నీరు ఇబ్బందులు లేకుండా ఉన్నాయి. – శివకుమార్ ,సైదాపురం

పెరోల్ ఘటనలో ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలి


చిందేపల్లి మధుసూదన్‌రెడ్డి

పెళ్లకూరు : జీవిత ఖైదీ శ్రీకాంత్‌కు గూడూరు, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యేలు పాశం సునీల్‌కుమార్, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పెరోల్‌కు రెకమండ్ చేస్తూ లెటర్ ఇవ్వడం దుర్మార్గమని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి చిందేపల్లి మధుసూదన్ రెడ్డి విమర్శించారు. శనివారం ఆయన సాక్షితో మాట్లాడుతూ.. ఎమ్మెల్యేలు రెకమండ్ చేసిన లేఖపై హోంమంత్రి అనిత సంతకం చేయడం దారుణమని విమర్శించారు. పెరోల్ లెటర్‌ను జైలుశాఖ అధికారులు గతనెల 16న తిరస్కరించినప్పటికీ ఎమ్మెల్యేలు, మంత్రి కలిసి పట్టు వదలకుండా జీవితఖైదీకి వంద రోజులు పెరోల్ ఇప్పించడం టీడీపీ పాలనా విధానానికి తార్కాణం అన్నారు. జీవిత ఖైదీకి పెరోల్ ఇప్పించడం వెనుక ఉన్న రహస్యాన్ని రాష్ట్ర ప్రజలందరికీ చెప్పాల్సిన బాధ్యత హోం మంత్రికి ఉందన్నారు. ఈ విషయంపై ప్రశ్నించిన మీడియా ప్రతినిధులపై హోం మంత్రి అనుచరులు దాడులకు పాల్పడడం శోచనీయమన్నారు. ముఖ్యమంత్రి ఈ విషయంలో స్పందించి హోంమంత్రి, ఎమ్మెల్యేలకు ఏ స్థాయిలో ముడుపులు అందాయో నిగ్గు తేల్చాలన్నారు. తక్షణమే ఎమ్మెల్యేలపై వేటు వేసి హోం మంత్రి పదవికి రాజీనామా చేయించేలా ముఖ్యమంత్రి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

మఠం ఆస్తుల రక్షణకు డిమాండ్


మాట్లాడుతున్న సీతారాం నాయక్

తిరుపతి కల్చరల్ : హథీరాంజీ మఠం ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా రక్షించాలని హథీరాం బావాజీ పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు సీతారాం నాయక్, గౌరవాధ్యక్షుడు డీటీ నాయక్ డిమాండ్ చేశారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. గాంధీ రోడ్డులోని హథీరాంజీ మఠం భవనం కూల్చివేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈమేరకు సమన్వయ సమావేశం నిర్వాహణతో నిర్ణయం తీసుకుంటామని కలెక్టర్ వెంకటేశ్వర్ చెప్పడం శుభపరిణామమని వెల్లడించారు. గిరిజన భవన్ చైర్మన్ వెంకటరమణ నాయక్, పరిరక్షణ కమిటీ జాతీయ ప్రధాన కార్యదర్శి శివానాయక బాబురావు చౌహాన్, కృష్ణ నాయక్ పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్‌లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి


అన్నా క్యాంటీన్‌లో భోజనం రుచి చూస్తున్న న్యాయమూర్తి

వెంకటగిరి రూరల్ : రూ.5 కే పేదలకు అన్నం పెడుతున్న అన్నా క్యాంటీన్‌లో అన్నం పంపిణీలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని వెంకటగిరి జూనియర్ సివిల్ జడ్జి విష్ణువర్మ పేర్కొన్నారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం సమీపం వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను శనివారం ఆయన తనిఖీ చేశారు. రూ.5 టోకెన్ కొనుగోలు చేసి భోజనం రుచి చూశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. నాణ్యత పాటించడంలేదని ఫిర్యాదు మేరకు తనిఖీ నిర్వహించగా అన్నంలో నాణ్యత కొరవడినట్లు సూచించారు. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు రాజేష్, రాజారాం, కిషోర్ పాల్గొన్నారు.

టంగుటూరి సేవలు ఆదర్శం

తిరుపతి క్రైమ్ : ఆంధ్రప్రదేశ్ ప్రథమ ముఖ్యమంత్రి ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 154వ జయంతి వేడుకలను ఎస్పీ హర్షవర్ధన్ రాజు శనివారం ఆయన కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. నిజాయతీ నైతిక విలువలతో కూడిన ఆయన జీవనశైలి నేటి యువత, ప్రభుత్వ యంత్రాంగానికి మార్గదర్శకమని పేర్కొన్నారు. ఆ మహనీయుడిని అనుసరించి దేశ అభ్యున్నతికి పాటుపడాలని పిలుపునిచ్చారు.

హెవీ లైసెన్స్ కోసం ఉచిత శిక్షణ

తిరుపతి అర్బన్:తిరుపతి అలిపిరి ఆర్టీసీ డిపో లో హెవీ లైసెన్స్ కోసం 10 మంది షెడ్యూల్డ్ కులాల వారికి ఉచిత శిక్షణ కోసం ఎంపిక చేయనున్నామని జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సహకార సంఘం లిమిటెడ్ అధికారి విక్రమకుమార్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వారిలో అయిదుగురు మహిళలు, అయిదుగురు పురుషులకు మాత్రమే అవకాశం ఉంటుందని చెప్పారు. 20–40 ఏళ్ల వయస్సు ఉండాలని తెలిపారు. ఎల్ఎల్ఆర్ కోసం రూ.210, లైసెన్స్ కోసం రూ. 1060 చెల్లించాలని తెలిపారు. అదనపు సమాచారం కోసం 99590 15657, 70130 08498 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 14 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 72,067 మంది స్వామి వారిని దర్శించుకోగా 25,212 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.75 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టోకెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టోకెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టోకెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం అవుతోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయాన్ని కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలోకి అనుమతించరని స్పష్టం చేసింది.

● అరుణాచలంలో భూమన గిరి ప్రదక్షిణ



వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకర రెడ్డి శనివారం అరుణాచలంలో గిరి ప్రదక్షిణ చేశారు. ఆయన వెంట ఆయన సతీమణి రేవతి, సోదరుడు రామచంద్రారెడ్డి తదితరులు ఉన్నారు. 40 ఏళ్ల తర్వాత మళ్లీ అరుణాచలంలో గిరి ప్రదక్షిణ చేయడం సంతోషంగా ఉందని ఆయన చెప్పారు. రాష్ట్రంలో అరాచక పాలన పోయి, సుపరిపాలన అందించడానికి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తిరిగి ముఖ్యమంత్రి కావాలని అరుణాచలేశ్వర స్వామిని ప్రార్థించినట్టు తెలిపారు. – తిరుపతి మంగళం

వీధి రౌడీలా ప్రవర్తించిన సర్వేయర్‌ను సస్పెండ్ చేయాలి


తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సోమసముద్రం గ్రామస్తులు

- తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించిన సోమసముద్రం గ్రామస్తులు

చిట్టమూరు : తాను ప్రభుత్వ అధికారి అని మరిచి మండల సర్వేయర్ వీధి రౌడీలా వ్యవహరించాడని చిట్టమూరు మండలంలోని కోగిలి పంచాయతీ సోమసముద్రం గ్రామస్తులు శనివారం తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించి నిరసన తెలిపారు. గ్రామస్తుల వివరాల మేరకు.. సోమసముద్రం గ్రామంలో దళితులు, బీసీలకు గతంలో ప్రభుత్వం కొంత స్థలాన్ని శ్మశానానికి కేటాయించారని పేర్కొన్నారు. అయితే చిట్టమూరు గ్రామానికి చెందిన అధికార పార్టీ నేతకు ఒక ఎకరా పొలం శ్మశానం పక్కనే ఉండేదన్నారు. అయితే అధికార పార్టీ నేత తనకున్న ఎకరా పొలంతో కలిపి 5 ఎకరాలు పట్టా చేయించుకున్నాడని ఆరోపించారు. ఆ భూమిని సర్వే చేసి అధికార పార్టీకి చెందిన నేతకు అప్పగించాలని మండలస్థాయి అధికార పార్టీ నేత ఒకరు హుకుం జారీ చేయడంతో తహసీల్దార్‌తో కలసి సర్వేయర్ సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలుసుకుని సోమసముద్రం గ్రామస్తులు అడ్డుకున్నారు. దీంతో అధికార పార్టీ నేత అండ దండలతో సర్వేయర్ రెచ్చిపోయి వీధి రౌడీలా గ్రామస్తులపై తిరగబడి మహిళలు అని కూడా చూడకుండా బూతులు తిడుతూ వీరంగం చేశాడన్నారు. సదరు సర్వేయర్ అధికార పార్టీ గల్లీ నేత నుంచి ముడుపులు తీసుకుని గ్రామస్తులకు కనీస సమాచారం ఇవ్వకుండా తన ఇష్టానుసారం ప్రభుత్వ భూమిని అధికార పార్టీ నేతకు అప్పనంగా కట్టబెట్టేందుకు పూనుకోవడం దారుణమన్నారు. దీంతో గ్రామస్తులు తమ గ్రామం నుంచి శనివారం భారీ ర్యాలీగా బయలుదేరి తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. వెంటనే సర్వేయర్‌ను విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యాలయానికి వచ్చిన తహసీల్దార్‌ను అడ్డుకుని తమకు న్యాయం జరిగే వరకు ఇక్కడి నుంచి కదిలే ప్రసక్తే లేదని తెగేసి చెప్పారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి గ్రామస్తులతో మాట్లాడారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సతీష్ కుమార్ గ్రామస్తులకు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు శాంతించారు. తమకు న్యాయం చేయకపోతే ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు.

డీఎంహెచ్‌వో ఆకస్మిక తనిఖీలు


తనిఖీలు నిర్వహిస్తున్న జిల్లా వైద్యాధికారి


స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి

రేణిగుంట: జిల్లా వైద్యాధికారి బాలకృష్ణ శనివారం స్థానిక పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో వైద్య సదుపాయాలను పరిశీలించారు. రోగులతో మాట్లాడి సమస్యలను ఆరా తీశారు. అనంతరం వైద్యాధికారి డాక్టర్ చక్రపాణి రెడ్డి, సిబ్బందితో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ అంటు వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా సిబ్బందితో కలిసి పిచ్చి మొక్కలు తొలగించారు.